క్లుప్తంగా

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు



ఆదేశిస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగనివ్వకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలో ఉన్న పూసాలలో శ్రీశంభు లింగేశ్వరస్వామి ఆలయం ఎదుట ఉన్న ఇసుక, చెత్తను తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పలు ఆలయాల వద్ద ఇప్పటికే మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించడంతోపాటు పిచ్చిమొక్కలను ట్రాక్టర్ల ద్వారా తొలగించామని తెలిపారు.

అనాథ ఆశ్రమానికి విరాళం

పాలకుర్తి: గోదావరిఖనిలోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ ఆశ్రమానికి బసంత్‌నగర్ ఓలీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విరాళం అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులందరూ కలిసి సేకరించిన రూ.10,140 గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్‌తో కలిసి ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

సుల్తానాబాద్: 18ఏళ్లు పైబడిన వారందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఎం.వెంకట రాంబాబు కోరారు. నెహ్రూ యువకేంద్రం, సంఘీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

ఆశ్రమ నిర్వాహకురాలికి సన్మానం



సన్మానిస్తున్న మహిళలు

రామగుండం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని తబితా ఆశ్రమ నిర్వాహకురాలు విమలను మహిళా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ రాపోలు కుసుమకుమారి, మాజీ మేయర్ రాజమణి, కార్పొరేటర్ దుబాసి లలిత, గుర్రాల శ్రీదేవి, దేవర శాంతి, చిలుక పద్మ, హేమలత, పుష్పలత, గోవిందు భాగ్య, రాజేశ్వరి, ఖజాబీ, పోచమ్మ, అనూష, స్వాతి ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్స్ తొలగింపు

కోల్‌సిటీ: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్‌లను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తొలగించివేస్తున్నారు. గురువారం కమిషనర్ స్వయంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీంతో మున్సిపల్ కార్యాలయం టీజంక్షన్ దగ్గర, రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న హోర్డింగ్‌లను, ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న వాటిని దశలవారీగా తొలగిస్తామని పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో కలిసి పోటీ

పెద్దపల్లిరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ బీఆర్‌ఎస్‌తో కలిసే పోటీ చేస్తుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడ్డ పొత్తును ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. నాయకులు రాజనర్సయ్య, అనిత, దుర్గయ్య, అనిల్, అరుణ, రామిళ్ల శారద, రంజిత్ సౌజన్య ఉన్నారు.

పాఠశాలలో వార్షిక వేడుకలు

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం రాత్రి వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకర్షించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ సన్మానించారు. వేడుకలను పురస్కరించుకొని జిల్లా విద్యాధికారి మాధవి, జెడ్పీ సీఈవో కె.నరేందర్ హాజరయ్యారు. వారిని హెచ్‌ఎం.అజ్మీర శారద సత్కరించారు.

అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలవాలి

- నిర్భయంగా ముందుకొస్తేనే సాధ్యం
- ట్రినిటి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి
- మహిళా దినోత్సవం సందర్భంగా కాలేజీలో 'సాక్షి' టాక్‌షో



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ నీతూరెడ్డి



సాక్షి టాక్‌షోలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: అన్నిరంగాల్లో రాణిస్తూ మహిళా శక్తిని చాటేందుకు ప్రతి మహిళ ముందుకు రావాలని ట్రినిటి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజు అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన 'సాక్షి టాక్ షో' కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ప్రస్తుత సమాజంలో పోటీ నెలకొందని, ప్రతిభ కనబర్చిన వారికే ఉన్నతస్థాయి అవకాశాలు దక్కుతాయని ప్రిన్సిపాల్ రాజు అన్నారు. ఉన్నత చదువులు చదివిస్తే పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చుకోలేమనే భావనలో కొంతమంది తల్లిదండ్రులున్నారని, అలాంటి వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించాలని సూచించారు. మహిళల రక్షణకు అనేక చట్టాలను పాలకులు రూపొందించారని వాటిపై అవగాహన పెంచుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ సూచించారు. తమ హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని భావించే వారిపై నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడగలమనే ధైర్యం మహిళల్లో రావాలన్నారు. స్వచ్ఛంద సేవలోనే కాకుండా ఉన్నతోద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ నారీమణులు రాణిస్తున్నారన్నారు. వేధింపులకు గురయ్యే మహిళలు, ముఖ్యంగా యువతులు తక్షణమే రక్షణ కోసం ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ గుడ్ల శ్రీనివాస్ అన్నారు. ఇందుకోసం అనేక యాప్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లు ఉన్నాయని, వాటిని తమ మొబైల్‌లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మహిళలకు రాజ్యాంగం అనేక హక్కులను కల్పించిందని, వాటిపై సరైన అవగాహన లేక వినియోగించుకోవడంలేదని ఆంగ్ల అధ్యాపకుడు రవి అన్నారు.

చట్టాలపై అవగాహన



చట్టాలపై సరైన అవగాహన లేకనే వేధింపులకు గురైనపుడు భయపడి ఊరుకుంటున్నారు. అలాకాకుండా అందుబాటులో ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకుంటే మనలో ధైర్యం పెరుగుతుంది. టోల్‌ఫ్రీ, యాప్‌లపై కూడా అవగాహన పెంచుకోవడం అవసరం.

– మంజూష, విద్యార్థిని

బాధ్యతగా ఉండాలి



పాలకులు మహిళల కోసం అనేక పథకాలు, అవసరమైన చట్టాలు అమలు చేస్తున్నారు. మనం బాధ్యతగా వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగితే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటే ఫ్రీ కాదు. మన వంతుగా ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుందనే విషయాన్ని గుర్తించి అవసరమైనపుడే ప్రయాణించాలి.

– సంధ్యారాణి, విద్యార్థి

మౌనంగా ఉండొద్దు



కాలేజీకి వచ్చి వెళ్లేటప్పుడు, ఇతర సందర్భాల్లో ఎవరైనా వేధించినా.. ఫొటోలు తీస్తున్నట్లు అనిపించినా భయపడకుండా నిలదీయాలి. తప్పనిసరైతే పోలీసులకు సమాచారం అందించాలి. కానీ మౌనంగా ఉంటే వారి ఆగడాలు మితిమీరి ప్రమాదానికి దారి తీసే అవకాశమిచ్చినట్టవుతుంది.

– శ్రీహర్షిణి, విద్యార్థి

లింగవివక్ష పోవాలి



సమాజంలో ఇంకా కొంత లింగవివక్ష కనిపిస్తోంది. ఏ రంగంలోనూ తక్కువ కాదనేలా ఉన్నతంగా ఆడపిల్లలు ఎదగాలి. తల్లిదండ్రులు కూడా ఆడ, మగ అనే లింగ భేదం లేకుండా అందరికీ సమాన విద్యనందించేలా చూడాలి. ఆడపిల్లలు అనగానే భయపడే పరిస్థితులు మారాలి.

– రమ్య, విద్యార్థిని

అన్నిరంగాల్లో అవకాశాలు



అన్నిరంగాల్లో మగవారితో పోటీ పడుతూ అవకాశాలు దక్కించుకుంటున్న మహిళలు ఉన్నారు. ఆడపిల్ల అనగానే భయపడకుండా ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు వచ్చినా.. తల్లిదండ్రులు పంపడం లేదు. వారిలో చైతన్యం పెంచాలి. అమ్మాయిని దూరం పంపడమెలా అన్న సందేహాలను దూరం చేయాలి.

– శరణ్య, విద్యార్థి

లక్ష్యాలకు అనుగుణంగా..



మగవాళ్ల కన్నా తామేమీ తక్కువ కాదనే రీతిలో ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రుల్లో ధైర్యం నింపాలి. సోషల్ మీడియాలో పరిచయంలేని వారితో స్నేహం చేస్తే ప్రమాదం కోరి తెచ్చుకున్నట్టే. అలా కాకుండా ఎంచుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగితే ఇబ్బందులుండవు.

– అవని, విద్యార్థి

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు

ఓదెల: ఎలాంటి ఆధారంలేని అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం మండలంలోని లంబాడితండా, నాంసానిపల్లె, అబ్బిడిపల్లె, గూడెం, గుంపుల, జీలకుంట, శానగొండ, మడక గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు పథకాలు ఇంటింటా వర్తిస్తున్నాయన్నారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి, ఏఈఈ సమ్మిరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, ఎంపీటీసీలు రాగిడి రవీందర్ రెడ్డి, తిప్పారపు శారదసంపత్, మాజీ ఉపసర్పంచు నిమ్మనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనోజ్‌క్రాంతి, పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ఐలయ్యయాదవ్, నాయకులు మొండయ్య, మల్లారెడ్డి, మల్లేశ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సుధారాణికి ఉత్తమ మహిళా పురస్కారం



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం భీమునిపట్నానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుధారాణి ఉత్తమ మహిళా పురస్కారం అందుకుంది. గురువారం జిల్లా కేంద్రంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ టీచర్ సుధారాణికి ఉత్తమ మహిళా పురస్కారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అందించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశానికి హాజరైన అధికారులు

గోదావరిఖని: సైబర్‌మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ సైబర్ హైజీన్‌పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీరోజు సైబర్ నేరస్తుల చేతిలో అమాయక ప్రజలు మోసానికి గురవుతున్నారని, సరైన అవగాహన లేకపోవడమే కారణమన్నారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, అధికారులు బచ్చ రవీందర్, నర్సింహారావు, రాజేంద్రప్రసాద్, ధనుంజయ, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, బూక్యదేశాయి, రంగారెడ్డి, ఎస్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గౌడ ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాజయ్యగౌడ్

సుల్తానాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గౌడ ఆత్మీయ సమ్మేళనం ఈనెల 10న ఏర్పాటు చేశారని, ఆయన అభిమానులు ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చి జయప్రదం చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్పీ రాజయ్యగౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లోని వి.కన్వెన్షన్ హాల్లో జరిగే సన్మాన సభను జయప్రదం చేయాలని కోరారు. గౌడ సంఘం నాయకులు కోటగిరి స్వామిగౌడ్, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

మహిళల ప్రగతే.. దేశ ప్రగతి



టీచర్ త్రివేణిని సన్మానిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: మహిళల ప్రగతే.. దేశ ప్రగతి అని డీఈవో మాధవి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో గురువారం అంతర్జాతీయ మహిళల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను డీఈవో సన్మానించారు. ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి, స్వరూప, కనకతార, రాజ్యలక్ష్మి, పద్మ, సంధ్యారాణి, రాజమణి, సంగీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన



విద్యార్థిని సన్మానిస్తున్న డీఈవో మాధవి

రామగిరి: మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం జిల్లా విద్యాధికారి మాధవి సందర్శించారు. పాఠశాలలో నిర్వహించే టీఎల్‌ఎం కార్నివాల్ కార్యక్రమాన్ని వీక్షించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను పరిశీలించారు. అలాగే రత్నాపూర్, బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నగునూరి సహజను డీఈవో సన్మానించారు. రత్నాపూర్ పాఠశాలకు విరాళాలు అందజేసిన మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమను డీఈవో అభినందించారు. ఇన్‌చార్జి ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు, నోడల్ అధికారి కొమురయ్య, ఎంపీటీసీ దర్ముల రాజసంపత్ పాల్గొన్నారు.

బాలికా సాధికారతపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం బాలిక సాధికారతపై సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, అక్షరాస్యత ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్సై ఓంకార్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సంప్రదాయాలు నేర్పించాలి



చిన్నారుల నృత్య ప్రదర్శన

గోదావరిఖనిటౌన్: విద్యార్థి దశలోనే సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ, యోగా, ప్రాణాయామం వంటి వాటిల్లో శిక్షణనిస్తే విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో దోహదం చేస్తుందని సింగరేణి ఆర్‌జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. స్థానిక పవర్‌హౌస్‌కాలనీలోని సాయిరిషి విద్యాలయ మాతృమందిర్ వార్షిక వేడుకలను మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ట్రస్మా నాయకులు సాంబశివరావు, కార్పొరేటర్ రమాదేవి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ సంధ్యారాణి, హెచ్‌ఎం ఎస్.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పెద్దపల్లిరూరల్: మున్సిపల్ ఆఫీస్‌లో కేక్ కటింగ్



గోదావరిఖని: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లక్ష్మి



మంథని: కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో హనుమానాయక్



ఎలిగేడు: సుల్తాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో..

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/మంథని/రామగుండం/ముత్తారం/సుల్తానాబాద్/ఎలిగేడు: పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా గురువారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురిని సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

రేపు మెగా జాబ్‌మేళా

గోదావరిఖని: రాష్ట్ర యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో 9న స్థానిక సింగరేణి స్టేడియంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ చొరవతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నుంచి 30ఏళ్లలోపు విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. 60 నుంచి 80 కంపెనీలు వస్తున్నాయన్నారు. నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేశ్, సింహాచలం, రవి, మధు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాల్సిందే

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీని పార్టీశ్రేణులతో కలిసి వినతిపత్రం అందించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

మంథని: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఈ నెల 10న నిర్వహించే గౌడ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మంథని గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు.

మహిళను కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు

జ్యోతినగర్: రాత్రి సమయంలో గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు ప్రయత్నించిన ఓ మహిళను గోదావరిఖని టూటౌన్ బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. ఎన్టీపీసీ రామగుండం అంబేద్కర్‌నగర్‌కు చెందిన మహిళ గోదావరి నదిలో దూకేందుకు బ్రిడ్జిపైకి చేరింది. గమనించిన బ్లూకోల్ట్స్ సిబ్బంది వెంకటస్వామి, పూర్ణచందర్ మహిళను కాపాడి ఆమె సమీప బంధువులకు అప్పగించారు.

ఎల్వోసీ అందజేత

రామగిరి: మండలంలోని కల్వచర్లకు చెందిన రోడ్డ శంకర్‌కు రూ.2,50,000 విలువ గల ఎల్వోసీ అందజేశారు. శంకర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా వైద్యఖర్చుల నిమిత్తం ఎల్వోసీ మంజూరు చేశారు. ఆపదలో అండగా ఉంటున్న మంత్రికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7461

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7461గా నమోదైంది. కనిష్ట ధర రూ. 6311, సరాసరి ధర రూ.7212గా నమోదైందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ పేర్కొన్నారు.

గ్రామసభలో మాజీ సర్పంచ్ బైఠాయింపు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో గ్రామ పంచాయతీలో గురువారం జరిగిన గ్రామసభలో మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్, అతని భార్య పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ వాణి తమకు బిల్లులు రావడం లేదని బైఠాయించి నిరసన తెలిపారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని రమేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ హరికృష్ణ ఈ విషయాన్ని సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఎరువుల కొరత లేదు

కమాన్‌పూర్: జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగారం, రొంపికుంట, కమాన్‌పూర్, గుండారంలోని ఎరువుల షాపులను డీఏవో తనిఖీ చేశారు. డీఏవో వెంట ఏవో ప్రమోద్‌కుమార్ ఉన్నారు.


తాళం వేసిన ఇంట్లో చోరీ

గోదావరిఖని: ఇంటికి తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన కన్నాల హరీశ్ ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లాడు. గురువారం తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగలు పడినట్లుగా గుర్తించాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రూ.5వేలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఊరేగింపు

ఓదెల: మల్లికార్జునస్వామి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఆలయ ప్రధాన అర్చకులు దూపం వీరభద్రయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం మల్లికార్జునస్వామి రథోత్సవం దేవస్థానం నుంచి మండల కార్యాలయాల మీదుగా, రైల్వేస్టేషన్ కాలనీ, జగదాంబ సెంటర్ వరకు కొనసాగింది.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతలు సాగు చేసిన పంటలు ఎండిపోయే దశకు చేరుతున్నాయని, వెంటనే సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, నాయకులు రఘువీర్‌సింగ్, శ్రీనివాస్, ఉప్పు రాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్టీల కన్నా కార్పొరేషన్ అభివృద్ధి ముఖ్యం

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్ వెన్నంటే ఉండి పనిచేస్తామని, పార్టీ కన్నా ఈప్రాంత అభివృద్ధి ముఖ్యమని, అందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన మూడునెలల్లోనే రూ.400కోట్లకు పైగా నిధులు ఈప్రాంతానికి మంజూరు చేసిన ఘనత మక్కాన్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు సాగంటి శంకర్, దాతు శ్రీనివాస్, దొంతు శ్రీనివాస్, తిరుపతి, నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషివిజ్ఞాన కేంద్రం తోడ్పాటు

రామగిరి: గ్రామాల అభివృద్ధికి కృషివిజ్ఞాన కేంద్రం తోడ్పాటు అందిస్తుందని శ్రీకొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డా.విజయ అన్నారు. గురువారం మండలంలోని రత్నాపూర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రంలో 12వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లోని అటారీ సంస్థ జోన్–10 శాస్త్రవేత్త డా.ఎఆర్ కేవీకే క్షేత్రాన్ని సందర్శించి టమాట, ఉల్లి, కాలీఫ్లవర్ క్షేత్రాలను పరిశీలించారు. కేవీకే శాస్త్రవేత్తలు వెంకన్న, భాస్కర్‌రావు, వినోద్‌కుమార్, కిరణ్, నవ్య, కూనారం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్, నాబార్డు ఏజీఎం జై ప్రకాశ్ పాల్గొన్నారు.